మడిసికో నాయం!



గుడిసేవ సుందరరామయ్య

“సీతాలు లేసిపోయిందిగా !”

పేరిగాడి మాటలు విని ఉలిక్కిపడ్డాడు సింహాచలం.

“నీకేమన్నా మతి సెలించిందా?” అంటూ నులకమంచంమీద లేచికూర్చున్నాడు.

“బలేవోడివి మావా ! ఏం తెలియనట్టు మాటాడుతుండావే?” నిష్ఠూరంగా పల్కాడు పేరిగడు.

“నిజంరా ! నాకేమీ తెలవదు !”

“ఇంటిపక్కనున్నోడికి తెలవదంటే ఎవరు నమ్ముతారు మావా ?”

“ఈ యిసయం నువ్వు చెప్పేదాకా నాకు తెలవదురా! సత్తె పెమాణకంగా! నిన్న మద్దానేళ నాకు వన్నంలో సేపల పులుసు వేసుకోమని యిచ్చింది కూడా! రేతిరి ఆలెస్సంగా రావటంచేత పలకరించటానికి యీలు కుదరలేదురా!” బాధగా పల్కాడు సింహాచలం.

“బహుశా నువ్వొచ్చేటప్పటికే యెళ్లిపోయుంటాది” ఊహించి చెప్పాడు పేరిగాడు.

సీతాలు అంతపని చేస్తుందని సింహాచలం ఎప్పుడూ ఊహించలేదు. ఆమె తత్వం అతనికి బాగాతెల్సు! రోజూ తప్పతాగి యింటికి వచ్చే మొగుడుపెట్టే బాధలన్నింటినీ, సింహాచలానికి చెప్పుకొని ‘నాబతుకిలా తగలబడింది తాతా !’ అని కన్నీరు కార్చేది. పెళ్లాన్ని చిత్రహింసలుపెట్టే సైదులును సింహాచలం చినాట్లు వేసేవాడు. కాని సైదులు ఏపి లక్ష్యపెట్టేవాడుకాదు.

‘మగాడు తాగుతాడు. తిరుగుతాడు. ఇంకా ఎన్నో సేత్తాడు. అయన్నీ నిలదీసి లడిగేటి అధికారం ఆడదాని కెవడిచ్చాడు మావా ?’ అని ఎదురు ప్రశ్న వేసేవాడు. ఒక్కోసారి సింహాచలం కళ్ళముందే, సీతాలును దెబ్బలు కొట్టేవాడు. ఆదృశ్యం చూస్తుంటే సింహాచలం గుండె తరుక్కుపోయేది. ‘ఆడ కూతుర్ని కొట్టడానికి ఆడికి సేతులెలా పత్తున్నాయి!’ అని మనస్సులోనే బాధపడేవాడు

“ఇంకా యేటిమావా, ఆలోసిత్తుండావ్! ఆడ సైదులుగాడు ఉస్సూరుమంటూ కూకున్నాడు. మనోళ్లంతా ఆడిదగ్గరే వున్నారు. యెళ్దాంరా !” అంటూ పేరిగాడు పరధ్యానంగా వున్న సింహాచలాన్ని వెంటబెట్టుకు వెళ్లాడు.

సింహాచాలాన్ని చూడగానే సైదులు బావురుమన్నాడు.

“సిమ్మాచెలంమావా ! సీతాలు నా కొంప ముంచేసినాది ! నన్ను అన్నాయంచేసి యెళ్లిపోయింద్రోయ్ !”

సైదులు పరిస్థితి చూస్తుంటే సింహాచలానికి జాలికల్గింది. పెళ్లామంటే ఎంతో ప్రేమవున్నట్లు మాట్లాడుతున్న సైదులు మాటలు సింహాచలాన్ని ఆశ్చర్యపర్చాయి. అతను చేస్తున్నదంతా నటనేనని, సీతాలంటే అతని కసలు ప్రేమలేదన్న విషయం సింహాచలానికి తెల్సు. మొగుడు రిక్షాబండిమీద సంపాదించినదంతా అతని తాగుడికి, జల్సాలకు సరిపోతుందన్న విషయాన్ని గ్రహించి సీతాలుకూడా ఓఫ్యాక్టరీలో కూలీగా చేరింది. ఆమె కూలీగా చేరిన దగ్గర్నుంచీ సైదులు జల్సాలు మరింత పెరిగిపోయాయి. భార్య సంపాదనకూడా అతని సరదాలకు హారతి కర్పూరమైంది. మొగుడికి భయపడి అడిగినప్పుడల్లా లేదనకుండా డబ్బులిచ్చేది అయినా ఒంటిమీద దెబ్బలు మామూలే!

“మావా! యేల్లేటప్పుడు నీకేమైనా సెప్పిందా?” ఆత్రంగా అడిగాడు సైదులు.

“అసలు అది యెళ్లిపోయిన యిసయం పేరిగాడు సెప్పేవరకు నాకు తెలవదురా! నేను వొచ్చేసరికి సానా రేతిరయింది” అన్నాడు సింహాచలం.

“ఇలా జరుగుతుందని ఏనాడూ అనుకోలేదు మావా!” అంటూ సైదులు సింహాచలాన్ని కౌగలించుకుని చిన్న పిల్లవాడిలా ఏడ్చాడు. అతన్ని ఎలా ఓదార్చాలో సింహాచలానికి అర్థం కాలేదు. కాని అక్కడకు చేరినవారంతా తలో మాట అని సైదులును ఓదార్చడానికి ప్రయత్నించారు,

“ఇంకా నయం! పిల్లా జెల్లా లేరు కాబట్టి సరిపోయింది” అన్నాడు ఏడుగురు పిల్లలను కన్న తండ్రి.

“కోపం వచ్చి మొగుడు ఓ దెబ్బ యేస్తే తప్పా? ఆమాత్తరం ఓర్చుకోలేదా పెళ్లామన్నది ” అన్నాడు పెళ్లాం అడుగుజాడల్లో నడిచే ఓ మొగుడు.

"పిదపకాలం! పిదప బుద్ధులు! ఎంతైనా ఆడదాని కింత తెగింపు పనికిరాదు" అంది ఆరేళ్ల క్రితం మొగుణ్ణి వదిలేసి వచ్చిన ఓ యిల్లాలు.

"ఆ... ఐదెక్కడికి పోతుందిలే! కొత్త మోజు తీరాక అదే పరిగెత్తు కొస్తాది" అన్నాడు నాలుగో పెళ్లాం కోసం గాలిస్తున్న ఏభయేళ్ల పడుచువాడు.

"తీసికెళ్ళినంత మాత్రాన ఆ యెంకటాచలం దీన్ని మనువాడతాడేమిటి?" అంటూ సందేహాన్ని వెలిబుచ్చింది పెళ్లి కాకుండానే అబ్బాయిని కన్న ఓ కన్నతల్లి.

రోడ్డుమీద కౌన్సిలర్‌గారు కన్పించగానే అందరూ తక్కున నోళ్లు మూశారు. కూర్చున్నవాళ్లంతా నిలబడ్డారు. కొంతమంది ఆయనకు ఎదురు వెళ్లారు. ఎలక్షన్లు అయ్యాక కౌన్సిలర్‌గారు ఈ గూడెంలోకి అడుగు పెట్టడం యిది నాల్గోసారి. మొట్టమొదటిసారిగాదండలతో వూరేగుతూవచ్చారు. అప్పుడు వచ్చారన్న మాటేకాని గూడెంలోని వాళ్ళతో మాట్లాడటానికి ఆయనకు టైమ్ దొరకలేదు రెండోసారి టైమంతా ఆ రోడ్డు కంట్రాక్ట్ చేస్తున్న వ్యక్తికిరోడ్డు ఎలా వేయించాలో చెప్పటానికే సరిపోయింది. ఎందుకంటె ఆ కంట్రాక్టర్ అతని సహోదరుడే! మూడోసారి వచ్చినప్పుడు మాత్రం గూడెంలోని వాళ్లను పల్కరించాడు. తను ఆ గూడెంకు ఎంతో సహాయం చేసే వుద్దేశంతో వున్నట్లు, అందుకు అందరి సహకారం అవసరమని వుపన్యాసం చెప్పాడు. తను రాబోయే ఎలక్షన్లలో నెగ్గితే తప్పకుండా గూడెంకు నీటి కొళాయిలు ఏర్పాటు చేస్తానని చెప్పాడు. అంతేకాదు కంకరరోడ్డుకూడా వేయిస్తానన్నాడు. ఆయనగారి మాటలకు, చేతలకు ఎన్ని కిలోమీటర్ల దూరంవుంటుందో ఆ గూడెంలోని వాళ్లందరకూ తెల్సు! ఎందుకంటే గత పదేళ్ల నుండి పోటీ లేకుండా ఆ వార్డు నుంచి ఎన్నిక అవుతున్నాడతను. ఇప్పుడిప్పుడే అతనికి పోటీగా ఎవరైనా పోటీగా నిలబడితే బాగుంటుందనే అభిప్రాయం గూడెంలోని చాలామంది మనస్సుల్లో కల్గ సాగింది. ఆ విషయం తెల్సినవాడు కావటం చేతనే నాల్గోసారి గూడెంలోకి వచ్చాడు. సైదులును పల్కరించటానికి. సైదులును చేతిలో పెట్టుకొంటే గెలుపు ఖాయమన్న విషయం ఆ రాజకీయ చతురునికి ఎవ్వరూ చెప్పనక్కర్లేదు.

"ఏరా సైదులూ! నేవిన్నది నిజమేనా?" అంటూ సైదుల్ని పల్కరించారు కౌన్సిలర్ గారు.

సైదులు గడగడలాడుతూ "నిజమే నయ్యగారూ! నా కన్నాయం జరిగిపోనాది" అన్నాడు.

"చక్కగా సంపాదించిపెట్టే మొగుడుండగా దానికేం రోగంరా?" చిరాకుగా అన్నారు కౌన్సిలర్‌గారు.

"లోండ తాగొచ్చి అప్పుడప్పుడు సిన్నగా కొట్టేవాణ్ణి దొరా! కాని ఈ మధ్యసలు దాని వొంటిమీద సెయ్యే ఏయటం లేదయ్యా! దానికేం కట్టమొచ్చి యిలాంటిపని చేసింది?" తనదేమీ తప్పు లేదన్నట్లుగా మాట్లాడేడు సైదులు.

విచికిత్స

హేతువాదం పెరుగుతోంది
ఈమాత్రం ఒళ్లెరగవా అని.
వేదసారం అడుగుతోంది,
ఆ మాత్రం ఎఱుక లేదా అని.
మానవత్వం నలుగుతోంది,
ఏమాత్రవేసుకుంటే ఏమో అని!

— **అవసరాల రామకృష్ణారావు**

కౌన్సిలర్‌గారు వెంటనే అందుకొని "ఒళ్లు పొగరెక్కి చేసే పన్లురా యివి! అణిగి మణిగి వుండాల్సింది పోయి ఎంతకు తెగించింది? మొగుడంటే భయభక్తులు లేకపోయాక యింక అదేం సంసారం చేస్తుందిరా? నువ్వు విచారించకు! ఎవరు తీసుకొన్న గోతిలో వాళ్లే పడ్తారు" అంటూ అప్యాయంగా సైదులు వీపు తట్టారు.

"నాకేంసేయాలో తెలియటంలేదయ్యా" విచారంగా అన్నాడు సైదులు.

"సైదులూ! ఒక విషయం చెప్తున్నాను గుర్తుంచుకో! ఆడది ఎప్పుడూ మగవాడికి లొంగే వుండాలి. అది ధర్మం. అలాకాకుండా మగవాణ్ణి ధిక్కరించి 'నువ్వెంత?' అంటూ బయటకు వెళ్ళిందంటే అది పతనానికి హేతువు. సీతాలు పోయిందని నీవు బాధపడనక్కర్లేదు. అలాంటి నీతిలేని దాంతో కాపురం చేసేదానికంటె ఒంటరి జీవితమే నయం!" అన్నారు కౌన్సిలర్‌గారు చుట్టూ చూస్తూ.

అప్పటిదాకా మౌనంగా వున్న సింహాచలం సైదులు భుజంమీద చేయివేసి "అయ్యగోరు సెప్పింది నిజమేరా! ఇలా యిచారిస్తూ కూకుంటే పయోజనం వుండదు. జరిగిందేదో జరిగిపోనాది. పోయి నీపని సూసుకో!" అన్నాడు.

"వెళ్లొస్తారా సైదులూ! ధైర్యంగా వుండు!" అనేసి వెళ్లిపోయారు కౌన్సిలర్ గారు. గూడెంలోని కొంతమంది ఆయన వెనకాలే కొంత దూరం వెళ్లి సాగనంపి తిరిగి వచ్చారు.

"నేను కూడా యెళ్లొత్తారా సైదులూ!" అంటూ తుండుగుడ్డ భుజాన వేసుకొన్నాడు సింహాచలం.

"నువ్వుకూడా అప్పుడే యెల్తున్నావా, మావా?" అంటూ దిగులుగా అడిగాడు సైదులు.

"ఇయ్యాల మా సావుకారుగారింట్లో సుబకార్యముంది. ఆరింటికి యియ్యాల పెద్ద పెద్దోళ్లంతా వత్తారంట ఆడ సేయాల్సిన పనులు సానా వున్నాయి. నే వెళ్తాత్తా" అనేసి తన యింటివైపు నడిచేడు సింహాచలం.

మరో అరగంటలో కాలకృత్యాలన్నీ ముగించుకొని షావుకారు గారింటికి బయల్దేరాడు సింహాచలం.

అతనంటె ఆ గూడెంలోని వాళ్లకెంతో అభిమానం. వయస్సులో కూడ అందరికంటె పెద్దవాడు. అందుచేత అక్కడతనికి గౌరవ మర్యాదలకు లోటులేదు కాని వాళ్లందరికీ ఒక్కటే దిగులు. సింహాచలం 'నా' అనే వాళ్ళు లేకుండా పోయారని! జీవితంలో ఎన్నో కష్టనష్టాలకు గురయ్యాడతను చేతికందిన కొడుకు కలరావచ్చి దుర్మరణానికి బలి కావటం అతని జీవితంలో తిరుగులేని దెబ్బ. ఆ దెబ్బ నుండి తేరుకోక ముందే భార్య గుండె జబ్బుతో మరణించింది ఎన్ని దెబ్బలు తిన్నా అతని గుండె ధైర్యం చలించలేదు. కాని వయోభారంచేత శక్తిని క్రమేపీ కోల్పోయాడు. అతనికి అంతకాలం జీవనాన్ని కలుగజేసిన రిక్షాను ఇక త్రొక్కలేకపోయాడు. జీవనోపాధికి మార్గాలు వెతుకుతున్న తరుణంలో షావుకారుగారి దగ్గర తోటమాలి ఉద్యోగం దొరికింది సింహాచలానికి

షావుకారుగారు ఆ వూళ్లో పెద్ద వ్యాపారవేత్త. మంచి పలుకుబడి, రాబడి వున్న వ్యక్తి. ఆయన చాల్హాకాలం నుంచి అపురూపంగా పెంచుకొన్న పూలతోటకు సింహాచలాన్ని మాలిని చేశాడు. పేరుకు తోటమాలి అయినా ఆ యింట్లో చిన్న చిన్న పనులు చాలావరకు సింహాచలమే చూస్తుండే వాడు కొద్ది కాలంలోనే యింట్లో వాళ్ల మన్ననలను పొందకల్గాడతను. షావుకారు గారికి సింహాచలమంటే మంచి నమ్మకం ఏర్పడింది.

సింహాచలం వెళ్లేసరికి షావుకారుగారిల్లు చాలా సందడిగా వుంది, గేటు తీసుకొని లోపలికి వస్తున్న సింహాచలాన్ని చూడగానే ''సింహాచలం! చీకటితోనే రమ్మన్నానుగా! ఇంత ఆలస్యం చేశావ్ ?'' అని అడిగారు షావుకారుగారు.

''గూడెంలో కొంచెం ఆలెస్సమయిన దండి!'' అన్నాడు సింహాచలం తప్పు చేసిన వాడిలా తలవంచుకొని.

''అయితే జరగాల్సిన పనులు చాలా వున్నాయి. నారాయణ, సోములు అంతా పని చేస్తున్నారు. నువ్వుకూడా వెళ్లి సాయం చెయ్'' అని చెప్పేసి యింట్లోకి వెళ్లారాయన. అంతా కల్సి ఆ సాయంత్రానికల్లా షావుకారుగారింటిని ఎంతో అందంగా అలంకరించారు.

రంగులను వెదజల్లే షామియానాలతోను,

మడిసికో నాయం!

కాంతులను విరజిమ్మే విద్యుద్దీపాలతోను పెళ్లివారి యిల్లులా కళకళ లాడుతోంది. విశాలమైన ఇంటి ప్రాంగణంలో టేబుల్స్‌ను, కుర్చీలను చక్కగా అమర్చారు. ఓ ప్రక్కగా ఎత్తయిన వేదికను కూడా ఏర్పాటు చేశారు. ఇంటివెనుక వేసిన పందిట్లో ఆ రోజు విందుకు కావల్సిన పదార్థాలన్నీ శరవేగంతో తయారవుతున్నాయి.

సాయంత్రం ఆరు దాటాక అతిధులు ఒక్కరొక్కరే రావటం ప్రారంభించారు. విలువైన వాహనాలమీద, ఖరీదైన దుస్తులతోను వచ్చే బంధువులను, స్నేహితులను చిరునవ్వుతో ఆహ్వానించారు షావుకారుగారు.

ప్రొద్దున్నుంచి బాగా పనిచేసి వుండటం చేత బాగా అలిసిపోయిన సింహాచలం తోటలో ఓ ప్రక్కగా కూర్చున్నాడు.

ఆహ్వానితులంతా వచ్చాక ఆవూరి చైర్మన్ వారితోసహా మరికొంతమంది పుర ప్రముఖులు వేదిక నలంకరించారు. అందరూ ఆ నాటి శుభకార్యాన్ని గురించి ముచ్చటిస్తూ, షావుకారుగారి విశాల దృక్పధాన్ని, ఆదర్శ హృదయాన్ని, ఆత్మ ధైర్యాన్ని శ్లాఘించారు.

పరధ్యానంతో ఉపన్యాసాలను ఆలకిస్తున్న సింహాచలం కౌన్సిలర్‌గారి కంఠం విన్పించగానే రక్కున లేచి నిలబడ్డాడు. ఆయన చెప్పే విషయాలను వినాలనే కుతూహలం అతనిలో అధికమైంది. మెల్లగా అడుగులు వేస్తూ ముందుకు వెళ్లాడు.

కౌన్సిలర్‌గారి కంఠం ఖంగున మ్రోగుతూంది.

''ఈరోజు చాలా సుదినం. శ్రీ శేషావతారంగారు కేవలం దయార్ద్ర హృదయులు మాత్రమే కాదని, గొప్ప ఆదర్శవాదులుకూడానని ఈనాడే రుజువుచేసుకుంటున్నారు. ఈ రోజుల్లో ఆదర్శాలు వల్లించటం చాలా తేలిక కాని ఆచరణలో పెట్టడం కష్టసాధ్యం. ఇలాంటి పరిస్థితుల్లో ఆయనగారు తన కుమార్తెకు పునర్వివాహం చేయటానికి నిశ్చయించి ఈరోజు తాంబూలాలు పుచ్చుకోవటం నిజంగా అభినందించాల్సిన విషయం. నిజం చెప్పాలంటే ఆయనగారి కుమార్తె కూడా ఎంతో యోగ్యురాలు. ఆడదంటే అబలకాదని నిరూపించుకొన్న ఆదర్శ మహిళ ఆవిడ. ఆడవారి హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం భర్తతోనేపోరాడి చివరకు విడాకులిచ్చి విజయాన్ని సాధించిన విజేత ఆవిడ. అసలు ఆడది మగాడికి లొంగి వుండాల్సిన అవసరం ఏమిటి? తనకు నచ్చినవాడితో సంసారంచేసే హక్కు ఆమెకుంది. ప్రస్తుతం ఈమెను వివాహం చేసుకోబోతున్నయువకుడు సురేష్ కూడా గొప్ప అభ్యుదయ భావాలుగల వ్యక్తి. విశాల హృదయుడు. అందుచేతనే వివాహం కాగానే అల్లుణ్ణి ఫారిన్ పంపించటానికి ప్రయత్నాలు చేస్తున్నారు షావుకారుగారు. కాబట్టి నేను మీ అందరికీ మనవిచేసేదేమిటంటే శేషావతారంగారి లాంటి విశాల హృదయులు, ఆయన అల్లునిలాంటి అభ్యుదయ వాదులు మన సంఘంలో యింకా యింకా తయారవ్వాలి. అప్పుడే మనదేశం ప్రగతిపధాన పురోగమిస్తుంది......'' జనమంతా చప్పట్లు కొట్టారు.

కౌన్సిలర్‌గారి మాటలు వినేసరికి సింహాచలానికి పిచ్చెక్కినట్లయింది.

'ఏమిటో. ఈ మాయదారి పెపెంచకం. సేసినపని ఒకటే అయినా ఒకరికి సివాట్లు, సెప్పుదెబ్బలు! మరొకరికి సప్పట్లు, సెమ్కీ దండలు...... మడిసికో నాయం...'' అని గొణుక్కుంటూ తోటలోకి వెళ్లాడు సింహాచలం.